
కథ

# శంకరం పెళ్లి

జీడిగుంట నరసింహమూర్తి

శంకరానికి వారం రోజులలో పెళ్లవుతుందనగా గోదావరికి వరదలొచ్చాయ్. గోదావరికి గండిపడి నీళ్లు ఉధృతంగా ఇళ్లలోకి వచ్చేసాయి. మళ్లీ ఆర్నెల్లవరకు సరియైన పెళ్లి ముహూర్తాలు లేవని శంకరం కాబోయే మామగారు వరద కాదు ప్రళయం వచ్చి పడినా పెళ్లి చేసెయ్యాలని నిర్ణయించాడు.




శంకరానిది ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం. "పెళ్లికి నాలుగురోజులు సరిపోవా?" అన్నాడు లీవ్‌లెటర్‌ను కోపంగా చూస్తూ శంకరం బాస్. అతని బాస్‌కు ముప్ఫయి అయిదేళ్ళొచ్చినా ఇంకా పెళ్లి కాలేదు. అతనికో పెళ్లి కాని అక్కగారు కూడా ఉంది. ఇరవై ఎనిమిది దాటని ఇద్దరు చెల్లెళ్లున్నారు. తండ్రంత చాదస్థుడు ఈ ప్రపంచంలో ఉండడు. మగపెళ్లి వారితో తిక్క తిక్కగా మాట్లాడి ఎన్నో సంబంధాలు చెడగొట్టుకున్నాడు. ఆయనకు కావల్సింది పెళ్లి కొడుకుకి తెలివితేటలున్నాయా లేదా అనేది కాదు. పెళ్లి కొడుకు తండ్రికూడా బాగా చదువుకున్నవాడై తను అడిగిన ప్రశ్నలకు తెలివిగా సమాధానం చెప్ప గలిగి ఉండాలి. తన కూతుళ్లు ఇంగ్లీషు ఎం.ఏ. చదివారని, పెళ్లి కొడుకు తెలుగు ఎం.ఏ. అని, "మేము ఇంగ్లీషు వాళ్లం– మీరు తెలుగువాళ్లు ఈ సంబంధం ఎలా చేసుకునేది" అంటూ తను ఆడపిల్లల తండ్రనే విషయం పూర్తిగా మర్చిపోయి బాధ్యతారహితంగా కుతుళ్ల పెళ్లి వాయిదా వేసుకుంటూ వస్తున్నాడు. ఆఖరికి ఒక కూతురు అర్ధరాత్రి తండ్రిని కత్తితో బెదిరించి "పెళ్లి చేస్తావా లేకపోతే ఎవరితోనైనా లేచి పొమ్మంటావా?" అంటూ కోపంగా అరచింది. వేరే ఇళ్లల్లో పెళ్లిళ్లు అవుతున్నాయంటే ఆయనకు ఎంతో అసహనంగా ఉండేది. కాని తన తప్పు ఆయన తెల్సుకోవడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. ఆయన కొడుకయిన శంకరం బాస్ నారాయణకు అప్పట్నుంచి ఎవరైనా పెళ్లి చేసుకుంటున్నట్లుగా తన దగ్గరకు శుభలేఖ తీసుకువస్తే చూడనట్లుగా ప్రక్కన పడేసేవాడు. లీవ్ లివ్వటానికి ఓ రకంగా ఒప్పుకునేవాడు కాదు.

బాస్ ఎక్కువ రోజులు లీవ్ ఇవ్వలేదన్న బాధ

ఒకవైపు గోదావరికి వరదలు మరోవైపు అసలు పెళ్లి చేసుకోవటానికే చిరాగ్గా ఉంది శంకరానికి. బాస్‌ను నిర్లక్ష్యం చేసి ఇంకా వాల్లయిదు రోజులు సెలవు ఎక్కువ వాడుకుందామంటే అసలే ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం. తీసేయటానికి నిముషం పట్టదు. అందునా తను పెళ్లి చేసుకోబోతున్నాడు. తన తండ్రి సంపాదించి ఇచ్చిన ఆస్తులూ పాస్తులూ అంటూ ఏమిలేవు. ఉద్యోగం పోగొట్టుకుని చెట్టుక్రింద కాపురం పెట్టలేడు.

వరద తగ్గుముఖం పట్టాక హైద్రాబాదు నుండి ముప్పయిమందికి పైగా బయలుదేరి రాజమండ్రి చేరారు. పెళ్లివారు తమ రాకకోసం రెండుమూడు గుర్రబ్బళ్లు వేసుకుని సిద్ధంగా ఉన్నారు. పెళ్లి కొడుకు ఇంకా కొంతమంది ముఖ్యమైన వాళ్లకు ఒక కారులో పంపారు. మధ్యలో కారు బురదలో కూరుకుపోవటంతో శంకరం కూడా మట్టిలోకి దిగి కారు తోయాల్సి వచ్చింది. వాళ్లందర్ని చూస్తుంటే మగపెళ్లి వారిలా కన్పించడంలేదు. అప్పడే మట్టిపని చేసొచ్చిన వాళ్లల్లా ఉన్నారు. విడిది ఇల్లు కన్పించగానే గుర్రాలు గట్టిగా సకిలించాయి. అదో పెద్ద పెంకుటిల్లు. చూర్లు ముందుకు వాలిపోయి ఉన్నాయి. తల జాగ్రత్తగా చూసుకుంటూ వచ్చిన జనం అంతా లోపలికి ఎగబడ్డారు.



ఒకప్రక్క తుఫాను తాలూకు ఛాయలు ఇంకా కన్పిస్తూనే ఉన్నాయి. చలి గడగడ వణికించేస్తోంది. అందులో శీతాకాలం కూడా! దానికితోడు ఇప్పడీ వడగూ, స్నాతకం. శంకరానికి ఆ పెంకుటింట్లో ఒకగది కేటాయించబడింది. కాని అప్పటికే ఎవరో ఆడవాళ్లు ఆ గదిలో పౌడరు కోటింగులు వేసేసుకుంటున్నారు. వాళ్ళు శంకరాన్ని పెళ్లికొడుకుగా గుర్తించలేదనుకుంటా. అనుకోకుండా శంకరం ఒక కర్ర ముక్కలతో చేసిన కిటికీలోంచి దొడ్డివైపు చూసాడు. అక్కడ మోపులు మోపులుగా తడిసిన కట్టెలున్నాయి. వాటిని మండించాలన్న ప్రయత్నంలో కొందరు అపసోపాలు పడుతున్నారు. వాళ్ల ఒళ్లు మండిపోతుందే తప్ప కట్టెలు మండటం లేదు. ఈలోపు శంకరం బంధుమిత్రులు, వదినలు, అక్కలు కొద్దిగా కాగిన నీళ్లతోనే ముస్తాబైపోతున్నారు. శంకరం స్నానం చేసాడా లేదా అన్న ఆలోచన అక్కడెవరికి లేదు. అసలక్కడ 'పెళ్లి కొడుకు' అనే ఒకజీవి ఉన్నాడని వాడికి అన్నీ చూసాకనే మిగిలిన వాళ్ల విషయం అనే ధ్యాస ఎవరికీ లేదు. ఈలోపు ఫ్లాస్కుల్లో కాఫీలొచ్చాయి. ఒక గుంపు వాటిపై పడి పగలగొట్టేసారు. ఒకప్రక్క బ్రాహ్మణులు వడుగు ముహూర్తానికి టైమవుతుందని కంగారు పెట్టేస్తున్నారు. పార్వతీ పరమేశ్వరుల్లా శంకరం తల్లిదండ్రులు పట్టుబట్టలు కట్టుకుని తయారైపోయారు. శంకరం మాత్రం ఎలాగో పాచి ముఖం మాత్రం కడుక్కోగలిగాడు. దొడ్లో బలవంతంగా వెలిగించిన కట్టెలెప్పడో ఆరిపోయాయి. శంకరం ఇంకా స్నానం చెయ్యలేదని తెల్సుకున్న ఒక పిల్ల పురోహితుడు శంకరం పెడరెక్కలు విరిచి దొడ్లోకి లాక్కెళ్లిపోయి అక్కడున్న గంగాళంలో నుండి పదిచెంబుల నీళ్లు అతని బుర్రపై గుమ్మరించాడు. శంకరానికి ఈ హఠాత్ పరిణామానికి ఊపిరాడలేదు. అతనికో మంచు పర్వతాన్ని కౌగిలించుకున్నట్టుగా ఉంది. ఒళ్లంతా పొగలొచ్చేస్తున్నాయి. ముక్కులు బిగపట్టేసాయి: అతని ప్రమేయం లేకుండానే అతనికి పంచెలు మార్చబడ్డాయి. వేసవి కాలంలో కూడా సలసల లాడే నీళ్లను పోసుకునే అతనికి తుఫాన్ పట్టిన ఈ శీతాకాలంలో అయిసు ముక్కలతో స్నానం చేయించినందుకు అతనికి అక్కడున్న వారందరిపై కసిగా ఉంది. పురోహితులు మంత్రాలు చదువుతూ శంకరాన్ని కూడా మధ్య మధ్యలో చదవ మంటున్నారు. అతని నోటికి గట్టిగా అటో మేకు, ఇటో మేకు వేసి బిగించినట్లుగా ఉండటంతో కనీసం నోరుకూడా తెరవలేకపోయాడు. పులిమీద పుట్రలా "అబ్బాయిని మళ్ళీ స్నానం చేయించి తీసుకురండి" అంటూ పురోహితులు ఆజ్ఞాపించటంతో మళ్లీ పిల్ల పురోహితుడు ఈసారి ఈడ్చుకెళ్లినట్లు తీసుకువెళ్లి మరో పది చెంబులు భళ్లున గుమ్మరించేసాడు. అతన్ని ఒక మహా సముద్రంలో మధ్యలో బయటకు కొట్టుకు రాకుండా విసిరేసినట్లుగా అన్పించింది. ఒక ప్రక్క ఇదేం పట్టనట్లు బంధుమిత్రులు వేడివేడి ఉప్మా లాగించేస్తూ ఎడమచేత్తో కాఫీని పోట్లోకి వంచుకుంటున్నారు. శంకరంలో మెల్లమెల్లగా ఒళ్లు నొప్పులు ప్రారంభమయ్యాయి. ముక్కుపుటాల్లోంచి నీళ్లు కారటం మొదలు పెట్టాయి. ఒకప్రక్క తడిసిపోయిన చితుకుల్ని మండించాలని ఒక బ్రాహ్మణుడు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నాడు. ఆ పొగలతో శంకరం మొహంమీద దట్టంగా కమ్మేసింది. అతనికి ఆ పొగల మధ్య ఒక్కసారి భళ్లున కడుపుతీరా ఏడ్చేయాలన్పించింది. పొగకి కళ్లనీళ్లు ఎలాగూ వస్తాయి కనుక తానేడుస్తున్నాడని ఎవరికి తెలియదు.

వరండాలో పదిహేను పదహారేళ్ల ఆడపిల్లలు వయ్యారంగా అక్కడున్న వాళ్లకు కాఫీలు, టీలు అందిస్తున్నారు.

"మీ దుంపతెగిపోను. ఒక కప్పు కాఫీ నా మొహాన తగలెయ్యండ్రా" అని అరవాలనుకున్న ప్రయత్నం ఫలించలేదు. వడుగు కార్యక్రమం పూర్తయింది. ఎంత సేపటికి పైకి లేవలేకపోతున్న శంకరాన్ని ఎవరో బలవంతాన లేపి మంచంపై కూర్చోబెట్టారు. ఇప్పడేదైనా రైలుంటే హైద్రాబాద్ పారిపోతే బాగుండ్ను అనుకున్నాడు శంకరం.

"ఇక స్నాతక కార్యక్రమం. వాయనా తయారవ్వు" అంటూ తొందర చేసారు పురోహితులు. శంకరానికి మాత్రం ఒకమూల రగ్గు కప్పకుని ముడంకె వేసి పడుకోవాలని ఉంది. "అసలు పెళ్లి ముహూర్తానికి ఆ పెళ్లి కూతురికి తనతో కాక ఇంకెవరితోనైనా పెళ్ళయితే బాగుండ్ను" అన్న వింత ఆలోచన కూడా అతనికి కలిగింది. తనింత అయోమయంగా అధోగతిలో ఉన్నా కూడా ఎవరూ పట్టించుకోరే! అసలు తనున్నానని గ్రహించకుండా కొందరాడవాళ్లు ఏమీ పట్టించుకోకుండా చీరలు, జాకెట్లు మార్చేసుకుంటున్నారు తన గదిలో. వాళ్లను చూడలేక తను సిగ్గుతో చచ్చిపోతున్నాడే తప్ప వాళ్లకేం పట్టడం లేదు.

రాత్రి పదకొండు గంటలకు పెళ్లి. తెల్లవారుఝామున మూడు గంటలకు గృహప్రవేశం. విడిదంతా గురకలు పెట్టేవాళ్లలా రామడోలు వాయించినట్లుగా ఉంది. తనకు కేటాయించిన గదిలో ఎవరో ఒకరిమీద ఒకరు పడి నిద్రపోతున్నారు. ఇక చేసేదిలేక కండువా నెత్తి క్రిందపెట్టుకుని గుమ్మం గడప మీద నిద్రపోయాడు శంకరం.

ఉదయానికి కొంతమంది చుట్టాలు ప్రక్క ఊళ్లకు సర్దుకున్నారు. శంకరం గది ఖాళీ అయ్యింది. "నిన్నంతా మీరు చలితోనూ, తలనొప్పితోను బాధ పడ్డారుటగా ఈ మాత్ర వేసుకోండి" అంటూ వేడి వేడి కాఫీతో మాత్ర అందించిన కొత్త పెళ్లికూతురిని అదే తన భార్యని చూడగానే శంకరం జరిగిందంతా మర్చిపోయాడు.